www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 15 డిసెంబర్ 2024
5
అన్నమయ్య

సింగపూర్ సదస్సుకు 'మిట్స్' ప్రొఫెసర్

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కళాశాల ఇఇఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సి.కుమార్ సింగపూర్‌లో బుధవారం జరిగిన ఐఇఇఇ టెకాన్-2024లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. సస్టైనబుల్ ఫ్యూచర్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లెర్నింగ్ టెక్నాలజీస్ అనే థీమ్ కింద జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు, నిష్ణాతులైన నిపుణులతో సరికొత్త పోకడలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలలో అద్భుతమైన పురోగతి, పరిశోధన అంశాలపై ఈ చర్చలు జరిగినట్లు పేర్కొన్నారు. దేశవిదేశాల నుంచి ఎంతో మంది ప్రొఫెసర్లు, పరిశోధకులు ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పండితుల అనుభవాలను పంచుకోవడానికి, మార్పిడి చేసుకోవడానికి ఈ సమావేశం ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందించిందని, అందులో తమ కళాశాల ప్రొఫెసర్ సి.కుమార్‌కు ఈ అవకాశం రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ సి.కుమార్‌ను కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

ఏకగ్రీవమే!

- నోడ్యూస్ పేరుతో వైసిపి బాయ్‌కాట్
- సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి మద్దతుదారులదే ఆధిపత్యం
- కడప 202, అన్నమయ్యలో 166 సంఘాలతో కూటమి
- గుండ్లకుంటలో వైసిపి మద్దతుదారుల గెలుపు
- పింఛా సాగునీటి ఎన్నిక వాయిదా

జిల్లా సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవాల పర్వం నడిచింది. జిల్లాలో శుక్ర, శనివారాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల్లో టిడిపి దౌర్జన్యాన్ని ప్రశ్నించిన ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షులు ఎస్.వి సతీష్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయడం, వైసిపి మద్దతుదారుల పత్రాలను చింపివేయడం, మీడియాపై దాడికి తెగబడిన నేపథ్యంలో సాగునీటి సంఘాల ఎన్నికలను వైసిపి బాయ్‌కాట్ చేసిన సంగతి తెలిసిందే. పెద్దముడియం మండలంలోని గుండ్లకుంట సాగునీటి సంఘం మినహా మిగిలిన 202 సాగునీటి సంఘాలను టిడిపి, జనసేన, బిజెపి ఏకగ్రీవం చేసుకున్నాయి. అన్నమయ్య జిల్లాలో పింఛా వాయిదా మినహా మిగిలిన 166 సాగునీటి సంఘాలను ఏక గ్రీవం పేరుతో కూటమి పార్టీలు పంచుకుని సంబరాలు చేసుకున్నాయి.

ప్రజాశక్తి – కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. కడప జిల్లాలోని 203, అన్నమయ్య జిల్లాలో 167 సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో కూటమి పార్టీలు ఏకగ్రీవాల హవాను కొనసాగించాయి. కడప జిల్లాలోని 203 సాగునీటి సంఘాల ఎన్నికలకుగానూ జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని పెద్దముడియం మండలం గుండ్లకుంట సాగునీటి సంఘానికి సంబంధించిన 12 టిసిల్లో ఏడింటిని వైసిపి, కూటమి ఒకటి గెలుచుకోగా మిగిలిన నాలుగింటిని నోడ్యూ సర్టిఫికెట్లు లేవనే పేరుతో వాయిదా వేసినట్లు సమాచారం. రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల ఎలెక్షన్ కడప జిల్లాలో కూటమి 202 స్థానాలను కూటమి పార్టీలు ఏకగ్రీవం చేసుకుంది. అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ నాయకత్వమైన సుగవాసి బాలసుబ్రమణ్యం, చమర్తి జగన్మోహన్‌రాజు అనుచరుల మధ్య కుమ్ములాటలు నేపథ్యంలో ఒంటిమిట్ట సాగునీటి సంఘం ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవులను బిజెపి, సిపిఐ మద్దతుదారులు దక్కించుకోవడం గమనార్హం. పింఛా సాగునీటి సంఘాల ఎన్నిక విషయంలో నెలకొన్న పేచీ కారణంగా వాయిదా పడడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలోని 167 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. పింఛా సాగునీటి సంఘం ఎన్నిక మినహా జిల్లాలోని మిగిలిన 166 సాగునీటి సంఘాలను కూటమి పార్టీలు దక్కించుకున్నాయి. రాయచోటి అసెంబ్లీ పరిధిలోని రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లి, ఎల్‌ఆర్‌పల్లి, గాలివీడు, రామాపురం మండలాలకు చెందిన 17 సాగునీటి సంఘాలను టిడిపి మద్దతుదారులు ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. ఒక్కో సాగునీటి సంఘానికి ఆరుగురు టిసి మెంబర్లను, వైస్‌ప్రెసిడెంట్, ప్రెసిడెంట్‌లను ఎన్నుకున్నారు. మదనపల్లి అసెంబ్లీ పరిధిలోని 16 సాగునీటి సంఘాల్నింటినీ టిడిపి ఏకగ్రీవం చేసుకుంది. ఇదేతరహాలో కడప, అన్నమయ్య జిల్లాల్లోని సాగునీటి సంఘాలను కూటమి పార్టీలు ఏకగ్రీవాల పరంపరను కొనసాగించడం గమనార్హం.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించాం : ఎస్‌పి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. శనివారం జిల్లాలోని రాయచోటి, మదనపల్లి, రాజంపేట సబ్ డివిజన్ల పరిధిలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడ ఎలాంటి గొడవలు ఘర్షణలు తలెత్తకుండా పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాట్లతో పాటు, ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. గ్రామాలలో ఎటువంటి గొడవలు పెట్టకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశామని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు సృష్టించాలని చూస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముందస్తుగా హెచ్చరికలు జారీ చేశామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇచ్చి ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి చేయాలని ఆదేశించడంతో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని పేర్కొన్నారు. జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందికి ఎస్‌పి అభినందనలు తెలిపారు.

ప్రాణం తీసిన పంట రక్షణ తీగ!

- పందుల కోసం వేసిన విద్యుత్ తీగలు తగిలి రైతు బలి

ప్రజాశక్తి-సుండుపల్లె

పంటలను వన్యప్రాణుల నుంచి కాపాడుకోవడానికి అమర్చిన రక్షణ తీగ రైతు ప్రాణం తీసింది. పంట పొలాన్ని అడవి పందుల బారి నుండి రక్షించుకోవడానికి అమర్చిన విద్యుత్ తీగలకు ప్రమాదవశాత్తు రైతు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ వావిలోడ్డుబిడికి సమీపంలో రెడ్డిచెరువు వద్ద పందుల కోసం పొలం చుట్టూ వేసిన విద్యుత్ వైర్లు రైతు మూడే వెంకటరమణ నాయక్(45)ను బలి తీసుకున్నాయి. వావిలోడ్డు బిడికి సమీపంలోని రెడ్డిచెరువు వద్ద చిన్నబిడికికి చెందిన అన్నమయ్య జిల్లా పారామెడికల్ అధికారి రవి నాయక్‌కు సంబంధించిన పొలం ఉంది. ఆ పొలంలో వేరుశనగ పంటను సాగుచేసిన రవి అడవి పందుల కోసం పొలం చుట్టూ కరెంట్ తీగలు అమర్చారు. ఆ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయాల్సిన రవి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ వైర్లు పొలం చుట్టూ అమర్చాడు. ఈ విషయం తెలియని వెంకటరమణ నాయక్ పింఛా నది నుండి కాలువలకు నీరు విడుదల చేయడంతో రెడ్డిచెరువులో రూ.4 లక్షల ఖర్చు పెట్టి చేప పిల్లలను వదిలి పెంచుకుంటున్నారు. కొత్త నీరు వల్ల చెరువులో ఉన్న చేపలు ప్రవాహంతో బయటకు వెళ్లిపోతాయన్న భయంతో ఆగమేఘాలపై పరిగెత్తుకుంటూ వెళ్లిన వెంకటరమణ అక్కడ మృత్యు రూపంలో ఉన్న విద్యుత్ వైర్లకు బలయ్యాడు. సంఘటన జరిగిన సమయంలో సమీపంలోనే పొలంలోనే ఉన్న పొలం యజమాని రవి ఏమీ తెలియనట్లుగా తాను ఊర్లో లేనట్టుగా నిరూపించుకోవడం కోసం ఆగమేఘాలపై రాయచోటికి వెళ్లి తాను డ్యూటీలో ఉన్నట్లు తంబు వేసి గుట్టుచప్పుడు కాకుండా జారుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి సమీపంలోని పొలం వద్ద విద్యుత్ వైర్లు తీసే వల్ల గ్రామంలోని పశువులు, మనుషులు అక్కడ తిరుగుతుంటారు కాబట్టి సమాచారం ఇవ్వాల్సి ఉంది. వైద్య వృత్తిలో ఉన్న వ్యక్తి ఇలా చేయడం పట్ల గ్రామస్తులు రవిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వైర్లు తగిలి చనిపోయిన మూడే వెంకటరమణ నాయక్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని విద్యుత్ వైర్లు తగిలి చనిపోవడంతో ఇక మాకు దిక్కెవరంటూ భార్యతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

విద్యుత్ అమర్చిన యజమానిపై చర్యలు తీసుకోవాలి : ఎఐకెఎస్

రాయచోటి టౌన్ : పందుల కోసం విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసిన యజమానిని కఠినంగా శిక్షించి రైతు కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర డిమాండ్ చేశారు. శనివారం రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుండుపల్లె మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామం వావిలోడ్డుబిడికి సమీపంలో రెడ్డిచెరువు వద్ద పందుల కోసం పొలం చుట్టూ తీసిన విద్యుత్ వైర్లు తగిలి మూడే వెంకటరమణ నాయక్ అనే రైతు మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. రైతు మృతికి కారణమైన అన్నమయ్య జిల్లా పారామెడికల్ అధికారి రవి నాయక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు మృతి చెందిన సంఘటన జరిగిన సమయంలో సమీపంలోనే పొలంలోనే ఉన్న పొలం రవి పట్టించుకోకుండా తప్పించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రవిపై కఠిన చర్యలు తీసుకోకుండా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా విద్యుత్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పంట పొలంలో మృతి చెందిన రైతు వెంకటరమణ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం

మృతి చెందిన బద్రీనాథ్‌రెడ్డి

మృతి చెందిన కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప–తిరుపతి జాతీయ రహదారిపై శనివారం కొత్త బోయినపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. రాజంపేట నుంచి కడప వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, కడప నుంచి రాజంపేట వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న కడప జిల్లా పులివెందులకు చెందిన బద్రీనాథ్‌రెడ్డి(20), అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.శ్రీకిరణ్‌కుమార్(20) అక్కడికక్కడే మృతి చెందారు. కిరణ్ కర్నూలు జిల్లా కోవెలకుంట్ల వాసి. పులివెందులకు చెందిన బద్రీనాథ్‌రెడ్డి చెన్నైలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నట్లు సమాచారం. తన మిత్రుడు పుట్టినరోజు సందర్భంగా బద్రీనాథ్‌రెడ్డి చెన్నై నుంచి రాజంపేటకు వచ్చినట్లు సహచర విద్యార్థులు తెలిపారు. రూరల్ సిఐ మహమ్మద్‌అలీ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించామని సిఐ తెలిపారు. వారి తల్లిదండ్రులు వచ్చాక ఆదివారం పోస్ట్ మార్టం నిర్వహించి మృతదేహాలను అప్పగిస్తామని చెప్పారు.

విద్యార్థుల మృతిపై మంత్రి దిగ్భ్రాంతి : రాజంపేట కొత్త బోయినపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అతి వేగంతో యువకులు ప్రమాదాల బారినపడి ప్రాణాల కోల్పోవడం చాలా బాధకరంగా ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మంత్రివర్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇంధన పొదుపు అలవాటుగా మారాలి : జెసి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

ఇంధనం చాలా విలువైందని, దానిని వృథా కాకుండా కాపాడుకుందామని జెసి ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇంధన శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను జెసి శనివారం తన ఛాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమం భవిష్యత్తు తరాలకు వనరులను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 డిసెంబర్ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ప్రజలందరూ ఇంధనాన్ని పొదుపు చేయాలని, విద్యుత్ శాఖ వారు తెలుపుతున్న చిట్కాలు పాటించి విద్యుత్ ఆదా చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌పిడిసిఎల్ ఇఇ పి.యుగంధర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలలో విద్యుత్ ఆదా అవసరాన్ని, వనరుల పరిరక్షణ గురించి అవగాహన పెంపొందించేందుకు విద్యుత్ పరిరక్షణ వారోత్సవాలను చేపడుతున్నట్లుగా తెలిపారు. ప్రతి ఇంటిలో లైట్లు, ఫ్యాన్లు, ఎలక్ట్రిక్ కుక్కర్, ఏసీ, ఫ్రిడ్జ్, గీజర్, వంటి విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించే టప్పుడు విద్యుత్ శాఖ వారు ఇచ్చిన చిట్కాలను పాటించి విద్యుత్తును ఆదా చేయడంతో పాటు విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిరుపేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.20 లక్షల చెక్కులను శనివారం ఎమ్మెల్యే నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి పంపిణీ చేసి టిడిపి ప్రభుత్వం పేదలకు ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. పట్టణంలోని ప్రభావతి, హర్షవర్ధన్, సహదేవరెడ్డి, రేవంత్, అంజమ్మ, రహీమున్నిసా చెక్కులు పొందిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అధిక మొత్తంలో సిఎం సహాయ నిధులు మంజూరు అయ్యాయన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తనతో పాటు కూటమి నాయకులు పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రామిశెట్టి కృష్ణ, ఒకటవ వార్డు ఇన్‌ఛార్జి కంచర్ల మల్లికార్జున నాయుడు, కురముట్ల నాగరాజ, బాలమాలి శేఖర్, వేమయ్య, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

కక్షిదారులకు చెక్‌ను అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీదేవి

లోక్ అదాలత్‌లో 6,553 కేసులు పరిష్కారం : జిల్లా జడ్జి

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా 20 బెంచీలను ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. 6,553 కేసులు పరిష్కరించి రూ.6.72 కోట్ల మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి కేసులను పరిష్కరించుకున్నారని చెప్పారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందుకుగాను న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, వైద్య అధికారులకు, డిస్టిక్ పబ్లిక్ రిలేషన్ అధికారులకు, రవాణాశాఖ అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ అధికారులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ అధికారులకు, ఎపి ఎస్పిడిసిఎల్ అధికారులకు, పత్రికా విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో కడప వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దినబాబు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె.హేమ స్రవంతి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి నందిని, కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుర్రప్ప నాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.

అధిక మొత్తంలో కక్షి దారులకు నష్ట పరిహారం చెల్లింపు...: మొదటి అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో రూ.83 లక్షల మొత్తానికి వాది శ్రావణి, ఇతరులు, ప్రతివాది అయిన చోళ మండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడ్డారు. ఈ కేసులో వాది తరపున న్యాయవాది ఎ.రవీంద్రారెడ్డి, ప్రతి వాది తరపున న్యాయవాది డి.రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఎం.శ్రావణి కృతజ్ఞతలు తెలియజేశారు. నాలుగవ అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో రూ.32 లక్షల మొత్తానికి వాది అయిన కందు జ్యోతి, ఇతరులు, ప్రతివాది అయిన బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ అయ్యారు. ఈ కేసులో వాది తరపున న్యాయవాది ఆర్. చంద్రబాబు రెడ్డి, ప్రతి వాది తరపున న్యాయవాదులు డి.రాజశేఖర్‌రెడ్డి, ఎన్.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కందు జ్యోతి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఐఎంఎ ప్రెసిడెంట్ మమతాలక్ష్మికి సత్కారం

ప్రజాశక్తి-పీలేరు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు బ్రాంచ్ అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ మమతా లక్ష్మి పలు గౌరవ సత్కారాలు లభించాయి. ఐఎంఎ పీలేరు బ్రాంచ్‌కు అధ్యక్షులుగా ఆమె ఎన్నికైన సందర్భంగా పీలేరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ మమతా లక్ష్మిని గుప్తా హాస్పిటల్లో కలిసి డాక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ వరసిద్ధ వినాయక స్వామి ఆలయ అభివృద్ధి మండలి మాజీ సభ్యులు ముప్పా నరసింహులు శెట్టి మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మమతా లక్ష్మి దంపతులు ఇరువురూ ఎందరో పేద రోగులను చేరదీసి మెరుగైన వైద్య సేవలు అందించటం హర్షణీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవాభావం ఉన్న వైద్యురాలుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో మరెన్నో పదవులు అలంకరించాలని అభిలషించారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బలస వేణుగోపాల్ మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎంపిక కావడం మంచి పరిణామమని, ఆ మీ సేవలు మరింత విస్తృత పరచాల్సిన అవసరం ఉందని అన్నారు. గుప్త హాస్పిటల్ వైద్యులు గత మూడు తరాలుగా వైద్య వృత్తిలో ఉంటూ రోగులకు సేవలు అందించడం జరుగుతూందన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, రాజ, అమర్నాథ్, మహేష్, వనిత, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

జోయాలుక్కాస్ గోల్డ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-రాయచోటి

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ మేనల్లుడు మౌర్యారెడ్డి శనివారం మదనపల్లె రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జోయాలుక్కాస్ గోల్డ్ ఎగ్జిబిషన్ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరితమ్మ మాట్లాడుతూ పట్టణంలో జోయాలుక్కాస్ గోల్డ్ ఎగ్జిబిషన్ సెంటర్‌ను ప్రారంభించడం ఎంతో శుభ పరిణామమన్నారు. జోయాలుక్కాస్ నిర్వాహకులు కస్టమర్లకు నాణ్యమైన గోల్డ్ విక్రయించి ఖాతాదారుల మన్ననలు పొందాలన్నారు. జోయాలుకాస్ నిర్వాహకులు ఇలాంటి ఎగ్జిబిషన్లు మరిన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

గోల్డ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న హరితమ్మ

ఎన్.వి.రమణ దంపతులను సన్మానిస్తున్న బ్రౌన్ గ్రంథాలయ నిర్వాహకులు

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి

- సుప్రీం కోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రతి ఒక్కరూ తెలుగు భాషపై మక్కువ పెంచుకొని, తెలుగు భాషను పరిరక్షించుకోవాలని సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ పేర్కొన్నారు. శనివారం సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన తెలుగు వైభవం కార్యక్రమానికి ముఖ్య అధితిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సిపి బ్రౌన్ బ్రిటిష్ నుంచి మన తెలుగు రాష్ట్రానికి వచ్చి తెలుగు భాషపై మక్కువ పెంచుకొని తెలుగు భాషకు కృషి చేశారన్నారు. సిపి బ్రౌన్ తన మొత్తం జీవితాన్ని తెలుగు భాష కోసం అంకితం చేశారన్నారు. ఇంగ్లీష్–తెలుగు నిఘంటువును తయారుచేసి మనకు అందించారన్నారు. వేమన పద్యాలను వెలుగులోకి తీసుకొని వచ్చి అందులోని భావాన్ని తెలియజేసి ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ఆయన ప్రేరణతో బ్రౌన్ శాస్త్రి కుటుంబ సభ్యులు గ్రంథాలయం కోసం ఎంతో పాటుపడుతూ సిపి బ్రౌన్ గ్రంధాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. తెలుగు భాషకు ఎంతో ప్రాచీన స్థానం ఉందని, తెలుగు భాష మాధుర్యం సంగీతం లాంటిదని పేర్కొన్నారు. యునోస్కో తెలుగు భాష అంతరించిపోతుందని తన నివేదికలో తెలిపిందిన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగాలు సంక్షేమ కార్యక్రమాలకు పని చేస్తాయని తెలుగు భాష కోసం ప్రజలందరూ కృషిచేసి మనమే కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎన్వి.రమణ సతీమణి శివమాల, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, బ్రౌన్ శాస్త్రి కుమారుడు విజయభాస్కర్, పిచ్చయ్య చౌదరి, వైవీయూ విద్యాలయం ప్రొఫెసర్ పుట్టా పద్మ, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ పాల్గొన్నారు.

వక్రమార్గం!

ప్రజాదృష్టి

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి మార్క్ రాజకీయం నడుస్తోంది. హౌస్ అరెస్టులు, సర్టిఫికెట్ల చింపివేత, దాడులు, దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని పరిహసించడం విస్మయాన్ని కలిగిస్తోంది. అప్రజాస్వామిక పద్ధతులతో కూటమి నాయకత్వం ఏకగ్రీవాలు చేసుకుంటోంది. అనైతిక పద్ధతులతో గెలిచే బదులు నామినేటెడ్ పోస్టుల తరహాలో కూటమి పార్టీ నాయకత్వానికి పదవులు కట్టబెట్టుకోవడం ఉత్తమమనే వాదన వినిపిస్తోంది. శుక్రవారం పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేముల, వేంపల్లి, తొండూరు, పెద్దముడియం మండల ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకత్వం ఎన్నికల పేరుతో అరాచకానికి పాల్పడడం ఆందోళనకరం. దౌర్జన్యపూరిత రాజకీయాలను అధికార పార్టీ నాయకులు సమర్థించుకోవడం దిగజారుతున్న ప్రమాణాలకు నిదర్శనమని గ్రహించాలి. ఇది ట్రైలరేనని, ముందు ముందు సినిమా ఉంటుందని మీడియా ముఖంగా నిస్సిగ్గుగా వ్యాఖ్యానించడం దారుణం. ఇటువంటి ధోరణి నైతిక విలువలకు పాతర వేయడమే అవుతుందని గ్రహించాలి. ఫలితంగా ప్రజాస్వామ్యం పరిహాసం పాలవుతుందని గ్రహించాలి. సంప్రదాయాలతో ఎవరికి నష్టమో ఆలోచించుకోవాలి. గతంలో మీరు చేశారు కదా ఇప్పుడు మేం చేస్తామంటే చేసేదేమీ ఉండదు. సంప్రదాయం చివరికి ప్రజాస్వామ్యాన్ని పరిహాసంపాలు చేయడమే అవుతుందనడంలో సందేహం లేదు. అనైతిక పద్ధతులతో గెలిచేదాని కంటే సక్రమ మార్గంలో ప్రయత్నించి ఓడిపోవడమే మేలని ప్రథమ ప్రధాని నెహ్రూ వ్యాఖ్యలను స్మరణకు తెచ్చుకోవాలి. ఎన్నికల్లో ఇటువంటి విపరీత ధోరణులకు పాల్పడితే భవిష్యత్‌లో ఎప్పటికీ ఎవరికి ఎటువంటి ప్రయోజనం చేకూరదని గ్రహించాలి. అంతిమంగా జాతి భవిష్యత్ అగమ్య గోచరంగా మారే అవకాశం ఉంది. దిగజారిన రాజకీయాలతో ప్రజాస్వామ్యం బలహీనపడే అవకాశాలు ఉన్నాయని గ్రహించుకోవాలి. విపరీత ధోరణులతో ముందుకెళ్తే ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. ఫలితంగా ప్రజల్లో చులకనగా మారిపోయే అవకాశం కనిపిస్తోంది. ఫలితంగా దేశానికి స్ఫూర్తి దాయకమైన నాయకత్వం లభించడం దుర్లభంగా మారనుంది. ఏడు దశాబ్దాలుగా దేశానికి ఆదర్శవంతమైన దూరదృష్టి కలిగిన నాయకత్వ లోపం కారణంగా దేశాభివృద్ధి కుంటి నడకన నడుస్తోంది. భారత్ కన్నా వెనుక స్వాతంత్ర్యం పొందిన దేశాలు అభివృద్ధి పథంలో మూడు తరాలు ముందంజలో నడుస్తుండడం నడుస్తున్న చరిత్ర, ఇప్పటికైనా దేశ, రాష్ట్ర పాలకులు దూరదృష్టి కలిగిన స్ఫూర్తిదాయకమైన నాయకత్వాలను జాతికి అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ

విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి-చిన్నమండెం

రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని డిఇఒ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండల కేంద్రం లోని స్థానిక ఉర్దూ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పదవ తరగతికి నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ప్రత్యేక తరగతుల సామాజిక శాస్త్రం, గణిత శాస్త్రం ఉపాధ్యాయులు పాఠాలకు హాజరయ్యారు. డిఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం తరగతులను నిర్వహించి ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించుటకు కృషి చేయాలని తెలిపారు. ఈ అవకాశం విద్యార్థులు వినియోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

లేబాకను నారా లోకేష్ దత్తత తీసుకోవాలి

ప్రజాశక్తి-నందలూరు

లేబాక గ్రామపంచాయతీని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దత్తత తీసుకొని అభివృద్ధి పరచాలని టిడిపి రాష్ట్ర నాయకులు ఆవుల బాలసుబ్రమణ్యం, లేబాక సర్పంచ్ లంకాయగారి నరసయ్య విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నారా చంద్రబాబు నాయుడు పేరుతో నిర్మించడం జరిగిందని అన్నారు. ఇక్కడి ప్రజలు తెలుగుదేశం పార్టీని అభిమానిస్తారని వారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. గ్రామ పంచాయతీలు అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కడవకూటి సంజీవ రాయుడు, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయలోక్ అదాలత్‌లో 125 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో125 కేసులు పరిష్కారం చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. శనివారం స్థానిక న్యాయస్థానంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మూడు బెంచ్ లను ఏర్పాటు చేసి నిర్వహించారు. పీలేరు 11వ అడ్హాక్ అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్ నిర్వహించిన మొదటి బెంచిలో రెండు కేసులు పరిష్కారం అయ్యాయని, రెండవ బెంచ్ లో సీనియర్ సివిల్ జడ్జి కె.రవి 6 కేసులు, మూడవ బెంచ్ లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్. గాయత్రి నిర్వహించిన బెంచ్ లో 117 కేసులు పరిష్కరించి మొత్తం రూ.68,56,262 పరిహారంగా వసూలు చేసినట్లు తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించడంలో సహకరించిన న్యాయవాదులు, పోలీస్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్ అధికారులు, కోర్టు కానిస్టేబుల్స్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-కడప

కడప నగరం ఎన్‌జిఒ కాలనీకి చెందిన ఒక అనాథ మహిళ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు అంత్యక్రియలు చేయడానికి సంబం ధికులు ఎవరు లేకపోవడంతో చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర రెడ్డి విజ్ఞప్తి మేరకు, మేము సైతం సేవా సంస్థ సభ్యులు అక్కడకు వెళ్లి ఆమెను తమ ఆత్మబంధువుగా భావించి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో అయ్యావారయ్య, రామలోకం షామియానా సురేష్, రామరాజు, గురవయ్య, భానుప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం, నవాబుకోట పంచాయతీ, బండమీదపల్లి నిరుపేద కుటుంబానికి చెందిన తంబళ్ల గాయత్రి చదువుల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తోంది. శనివారం ఆ విద్యార్థిని ఉన్నత చదువుల కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.బాలసంజీవు, ఉపాధ్యాయులు రెడ్డెప్ప రెడ్డి, సుజాత చేతుల మీదుగా యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ తనవంతుగా రూ.5 వేలు ఆర్థిక సహాయం అందిచడం అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ సంస్థ తోడ్పాటును అందిస్తుందన్నారు.పేద విద్యార్థిని గాయత్రి భవిష్యత్తులో వైద్య విద్యను పూర్తి చేసి ప్రజలకు సేవ చేయాలన్నదే తన ఆశయమని చెప్పడం ఆనందంగా ఉందన్నారు.సదరు విద్యార్థి ఆశ నెరవేరాలని ఆకాంక్షించారు.

గోనె సంచులకు భలే గిరాకీ

ప్రజాశక్తి - చాపాడు :వరి ధాన్యాన్ని నిల్వ ఉంచే గోనె సంచులకు ప్రస్తుతం మంచి గిరాకీ ఏర్పడింది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 50వేల ఎకరాలలో వరి పంట సాగైంది. ప్రస్తుతం పంట నూర్పిడి దశలో ఉంది. వరి ధాన్యాన్ని అమ్మకం చేపట్టాలన్న ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి రవాణా సాగించాలన్న, ఇంటిలో నిల్వ ఉంచుకోవాలన్న గోనె సంచులు తప్పక ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ సంచులు కొత్తవి ప్రస్తుతం ఒకొక్కటి రూ.50 వరకు ధర ఉంది. ఒకసారి ఉపయోగించినవి రూ.40 నుంచి రూ.43 వరకు ధర పలుకుతున్నాయి. మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి రైతులు గోనె సంచులను కొనుగోలు చేస్తున్నారు. 50 కిలోల బియ్యం సంచులు అయితే రూ.28 లభిస్తున్నాయి. గోనే సంచుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వరిపంట నూర్పిడి పూర్తిస్థాయిలో ప్రారంభమైతే వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

మాస్టర్స్ పట్టా పొందిన పోరెడ్డి లక్ష్మీవిభ

ప్రజాశక్తి - సింహాద్రిపురం:మండలంలోని హిమకుంట్ల గ్రామానికి చెందిన పోరెడ్డి లక్ష్మివిభ మాస్టర్స్‌లో పట్టా సాధించడంతో పలువురు అభినందించారు. యూఎస్‌లోని ప్రతిష్టాత్మకమైన ఏఅండ్ ఎం(టాక్సెస్) యూనివర్సిటీ నుండి పట్టా తీసుకు న్నారు. రెండేళ్ల నుంచి ఈ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్నారు. లక్ష్మీవిభ మాజీ జెడ్పిటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోడలు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని పలువురు ఆకాంక్షించారు.

ప్రశాంతంగా ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు

రాజంపేట : చమర్తిని సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేటలో నీటి సంఘాల ఎన్నికలను కూటమి మద్దతుదారులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. ఈ ఎన్నికలను రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎప్పటికప్పుడు ఎన్నికలు సమీక్షిస్తూ ఏకగ్రీవం అయ్యేందుకు కృషి చేశారు. ఒక్క ఊటుకూరు నీటి సంఘం ఎన్నికల్లో మాత్రం సుగవాసి బాలసుబ్రమణ్యం ఆయన అనుచరుడి విజయానికి కృషి చేశారు. మిగిలిన తాళ్లపాక, మన్నూరు, పోలి, హస్తవరం, గుండ్లూరు, మందపల్లె చెరువులు కు సంబంధించిన ఎన్నికలు పూర్తిగా చమర్తి కనుసన్నల్లో జరిపించారు. జగన్‌మోహన్‌రాజు వ్యూహంతో ఆరు చెరువులు, రెండు స్ప్రింగ్ ఛానల్ ఎన్నికలు కూటమి నాయకులు కైవసం చేసుకున్నారు. పోలి చెరువు నీటి సంఘానికి అధ్యక్షులుగా నాగినేని నాగేశ్వర్ నాయుడు, వైస్ చైర్మన్ గా పసుపులేటి పెంచలయ్య ఎన్నికయ్యారు. తాళ్లపాక నీటి సంఘానికి అధ్యక్షులుగా జవాజి అదృష్టదీపుడు, వైస్ చైర్మన్ గా రాటకొండ వెంకటేష్, ఊటుకూరు చెరువు నీటి సంఘానికి నామా హరినాథ్, వైస్ చైర్మన్‌గా చంగమ్మ, హస్తవరం చెరువు నీటి సంఘం అధ్యక్షులుగా ఆవుల యానాదయ్య, వైస్ చైర్మన్ కొండూరు రుక్మిణి, మన్నూరు చెరువు నీటి సంఘం చైర్మన్ గా నారదాసు రామచంద్రయ్య, వైస్ చైర్మన్‌గా బాలరాజు కృష్ణంరాజు, గుండ్లూరు స్ప్రింగ్ ఛానల్ అధ్యక్షులుగా ముమ్మడి స్వప్న, వైస్ చైర్మన్ అరవరాముల‌మ్మ, మందపల్లి స్ప్రింగ్ ఛానల్ చైర్మన్ అల్లం శ్రీనివాసులు, వైస్‌చైర్మన్ అద్దేపల్లి పురుషోత్తం రాజు ఎన్నికయ్యారు. ఎన్నికైన చైర్మన్ లను, వైస్ చైర్మన్, డైరెక్టర్లను కూటమి నాయకులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి ఆయా గ్రామాలలో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పోలి చెరువు నీటి సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన చైర్మన్ నాగినేని నాగేశ్వరరావు నాయుడు, వైస్ చైర్మన్ పసుపులేటి పెంచలయ్య, సభ్యులు కోనంకి మల్లిఖార్జున నాయుడు, చవన శంకరయ్య నాయుడు, కోవూరు పరశురాం నాయుడు, గురజాల రెడ్డయ్య నాయుడు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, కమ్మ సంఘం అధ్యక్షులు శివ నారాయణ చౌదరి, రూరల్ టిడిపి అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, బాపనయ్య నాయుడు తదితరులు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజును పార్లమెంట్ కార్యాలయంలో కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

రాయచోటి : సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలలో నియోజకవర్గం ఆరు మండలాల్లోని మొత్తం 15 సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి టిడిపి భ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మొత్తం 15 సాగునీటి వినియోగదారుల సంఘాలకు టిడిపి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి వినియోగదారుల సంఘాలను నిర్వీర్యం చేసి ఎన్నికలు నిర్వహించకపోవడంతోపాటు వాటి నిర్వహణను అస్సలు పట్టించుకోకపోవడం వల్ల సాగులో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరిగి సంఘాలకు సభ్యులు ఏర్పడడంతో నిర్వహణ మెరుగవుతుందన్నారు. అంతేగాక వీటి నిర్వహణకు ప్రభుత్వం నుంచి కూడా పూర్తి సహకారం అందుతుందన్నారు. నియోజ కవర్గంలో తెదేపాకు పూర్తిగా మద్దతు తెలిపి ఈ ఎన్నికలను ఏకగ్రీవం చేయడం పట్ల సాగునీటి వినియోగదారుల సంఘాలు, ప్రజలందరికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. **కలికిరి :** మండలంలో కలికిరి పెద్ద చెరువు, గుండ్లూరు భయపరెడ్డి చెరువు పరిధిలో నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. తాసిల్దార్ మహేశ్వరి బాయ్ ఆధ్వర్యంలో కలికిరి పెద్ద చెరువు సంఘంలో జరిగిన ఎన్నికల్లో రత్నశేఖర్ రెడ్డి, సుందర్ రాజుల శెట్టి, మహమ్మదాలీ, పాపిరెడ్డి, ప్రతాపరెడ్డిలు సభ్యులుగా ఉండగా జి.రత్నశేఖర్‌రెడ్డి చైర్మన్ గాను, సుందర్ రాజుల శెట్టి వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపిడిఒ భానుమూర్తిరావు ఆధ్వర్యంలో జరిగిన గుండ్లూరు బైరెడ్డి చెరువు సంఘంలో రామచంద్రయ్య, సరళ, శ్యామలమ్మ, గురవయ్య, నాగయ్య సభ్యులుగా ఉండగా చైర్మన్‌గా రామచంద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐ రెడ్డిశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో ఎఎస్ఐ మధుసూదనాచారి పోలీసు సిబ్బంది నిర్వహించారు. **గాలివీడు :** మండల కేంద్రంలో శనివారం జరిగిన సాగునీటి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అరవీడు కుశావతీ ప్రాజెక్ట్ నీటి సంఘం అధ్యక్షుడిగా మలసాని శ్రీనివాసులురెడ్డి, గాలివీడు పెద్ద చెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా చెక్కా రామాంజనేయులు, తలముడిపి చెరువు నీటి సంఘం అధ్యక్షుడుగా కొండ్రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇరిగేషన్ జెఇ కళ్యాణ్ కుమార్ రాజు పేర్కొన్నారు. నీటి సంఘ ఎన్నికల్లో తహశీల్దర్ భాగ్యలత, ఎంపిడిఒ సిఎ. జవహర్‌బాబు పాల్గొన్నారు. **రామాపురం:** మండ లంలో జరిగిన మూడు చెరువుల నీటి సంఘాలు ఏకగ్రీవం అయినట్లు అధికారులు తెలిపారు. చిట్లూరు పెద్ద చెరువుకు చైర్మన్‌గా గాలి లక్ష్మయ్య, వైస్ చైర్మన్‌గా చింపిరి సుబ్బ రాయుడు ఏకగ్రీవంగాఎన్నికైనట్లు ఇఇపిఆర్‌డి పట్నాయక్, ఆర్ఐ చాన్‌బాషా తెలిపారు. హసనాపురం పెద్ద చెరువుకు చైర్మన్‌గా నరసింహారెడ్డి, వైస్ చైర్మన్‌గా బుడం సాబ్‌ను ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు తహశీల్దార్ రామానుజులు, ఎంఇఒ రామకృష్ణుడు, కల్పనాయునిచెరువు పెద్ద చెరువుకు చైర్మన్‌గా రౌతు సరోజ వైస్ చైర్మన్‌గా నారాయణరెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంపిడిఒ జాషువా, ఎఒ నాగమణిలో తెలిపారు. **నిమ్మనపల్లె :**సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు మండలంలో నిరసనల మధ్య జరిగింది. మండలంలోని బహుదా ప్రాజెక్ట్, కుమార అహోబిల నాయని చెరువు, కోమటివాని చెరువు, కొండవంక చెరువులకు సాగునీటి వినియో గదారుల సంఘాల ఎన్నికలను ఎన్నికల అధికా రులు నిర్వహించారు. బహుద ప్రాజెక్టు సాగునీటి సంఘం అధ్యక్షులుగా చింతపర్తివారి పల్లెకు చెందిన కె.దేవేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులుగా మంచూ రుకు చెందిన టి.నాగరాజా లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అహోబిలనాయుని చెరువు అధ్యక్షులుగా ఎం.ఆసిఫ్ ఉల్లా ఖాన్, ఉపాధ్యక్షులుగా మద్దూరి వెంకటరమణ, కోమటి వానిచెరువు అధ్యక్షులుగా కడపల గురుప్రసాద్, ఉపాధ్య క్షులుగా బోడెప్పగారి వెంకటరమణ, కొండవంకచెరువు అధ్యక్షులుగా పుంగనూరు రమణ, ఉపాధ్యక్షులుగా కడపల జగన్నాథంలో ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఎన్నికైన అధ్యక్షులు ఉపాధ్యక్షులకు ఎన్నిక ధ్రువపత్రాలను అందించారు. ఎన్నికల అధికారులుగా తహసిల్దార్ ధనుంజ యులు, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఇరిగేషన్ ఎఇ శ్రీహరి రెడ్డి, ఆర్డబ్ల్యుసి ఎఇ మిథున్ చక్రవర్తి, ఎంఇఒ పద్మావతి,ఎఒ మురళీమోహన్, హౌసింగ్ ఎఇ అమర్నాథ్, ఎంఇఒ నారాయణ ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మదనపల్లె మండలంలోని నాలుగు ప్రధాన చెరువులకు ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. సిటిఎం గ్రామంలోని చిన్నాయన చెరువుకు ఎంపిడిఒ తాజ్ మస్రూర్, కొత్తవారిపల్లి ప్రాంతంలోని పెద్ద చెరువుకు తహశీల్దార్ ఖాజాబీ, చీకలబైలు లోని వెంకటమ్మ చెరువుకు అగ్రికల్చర్ ఆఫీసర్ నాగప్రసాద్, తట్టివారి పల్లిలోని నింగిశెట్టి చెరువుకు సివిల్ సప్లై డిటి రెడ్డెప్పలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ప్రధానంగా నాలుగు చెరువులకు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థులే నాలుగు చెరువుల సాగినీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పెద్ద చెరువుకు వేమన్న, చిన్నాయన చెరువుకు ప్రసాద్ నాయుడు, లింగిశెట్టి చెరువుకు రాజన్న, వెంకటమ్మ చెరువుకు శివలు అధ్యక్షులుగా ఏకగ్రీవమయ్యారు. **పీలేరు:**పీలేరు గ్రామ పంచాయితీలోని అయ్యంనాయుని చెరువు, గూడరేవుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సూరప్పగారి చెరువు, దొడ్డిపల్లి పంచాయతీలోని చింతల చెరువుకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలను వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా బహిష్కరించడంతో వీటిని సూత్రప్రాయంగా నిర్వహించాల్సి వచ్చింది. దొడ్డిపల్లి పంచాయితీలోని చింతల చెరువుకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రాయల రమణ, మోకాటి ఎర్రయ్య, సభ్యులుగా బాలాజి, సురేంద్ర, ఎర్రయ్య, రామ్మూర్తి వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీలేరు గ్రామపంచాయతీ పరిధిలోని అయ్యపనాయుని చెరువు సాగునీటి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లుగా పి.హరినాథ్‌బాబు, అయ్యల నారాయణ, సభ్యులుగా సరస్వతమ్మ, రాజగోపాల్ రెడ్డి, రమేష్‌బాబు, రాజమ్మలు ఎన్నికయ్యారు. మండలంలోని గూడరేవుపల్లి పంచా యితీ, సూరప్పగారి చెరువు సాగునీటి సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యాయులుగా అన్నారెడ్డి, విశ్వ నాథ, సభ్యులుగా హరిబాబు, వెంకటరమణ, నాగరాజ, మల్లికార్జున ఎన్నికయ్యారు. అదేవిధంగా మండలంలోని దొడ్డిపల్లి గ్రామ సచివాలయం పోలింగ్ కేంద్రంగా చింతల చెరువు సాగునీటి సంఘానికి ఎన్నికల నిర్వహణ అధికారిగా పీలేరు తహశీల్దార్ ఎం.భీమేశ్వర రావు, పీలేరు అయ్యపనాయిని చెరువు సాగునీటి సంఘానికి స్థానిక కోటపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం ఎన్నికల అధికారిగా ఎంపిడిఒ శివశంకర్, గూడరేవుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంగా గూడరేవుపల్లి సూరప్పగారి చెరువు ఎన్నికల అధికారిగా పంచాయితీరాజ్ ఎఇగా రామకృష్ణ నాయక్ వ్యవహరించారు. **సుండుపల్లి:** మండలంలోని ముడుపాడు గ్రామపంచాయతీలో ఉన్న పింఛా ప్రాజెక్ట్ నీటి సంఘం ఎన్నికల్లో ఎన్నికల అధికారి ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి టిడిపి నాయకులు వాగ్వివాదానికి దిగారు. ఎస్ఐ శ్రీనివాసులు ఆందోళన కారులను పంపించి వేశారు. **రైల్వేకోడూరు :** మండలంలోని 9 నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా కూటమి అభ్యర్థులు ఎన్నికయ్యారు. అనంతరాజుపేట బ్రాహ్మణ చెరువుకు పసుపులేటి సుబ్రహ్మణ్యం (జనసేన),తూర్పు పల్లె చిన్నంగి చెరువుకు జేసి రాజగోపాల్‌రెడ్డి, ఓబనపల్లె ట్యాంకు కనపర్తి జయమ్మ, శెట్టిగుంట ట్యాంకు గుర్రం సుబ్రహ్మణ్యం నాయుడు,చౌడవరం ట్యాంకు సవరం రవికుమార్(జనసేన), ఉప్పరపల్లి ట్యాంకు కె. కేశవరెడ్డి,చాకిరేవు కోన జలాశయానికి మద్దిన సుబ్బరాగవనాయుడు,వాగేటి కోన రిజర్వాయర్ కు కంచి రాజు సునీత,చింతలపల్లి ఆనకట్టకు పొడల సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగాఎన్నికయ్యారు. **వీరబల్లి :** మండలంలో శనివారం జరిగిన మూడు సాగునీటి సంఘాల ఎన్నికల్లో గుర్రప్ప గారిపల్లి సాగినీటి సంఘం, ఉప్పరపల్లి సాగునీటి సంఘాలు టిడిపి ఏకగ్రీవం చేసుకుంది. వీరబల్లి సాగునీటి సంఘం రసాబాసాగా మారింది. నామినేషన్‌కు ఇరువురు దరఖాస్తు చేసుకోగా అందులో ఉంచిన ధ్రువపత్రాలు పార్టీలకు చెందిన 12 దరఖాస్తుల్లో సక్రమంగా లేకపోవడంతో అధికారులు రద్దు పరిచారు. తమకు ముందు సమాచారం ఎందుకు ఇవ్వలేదని అధికారులపై ఆగ్రహ వ్యక్తం చేశారు.ఎన్నికల వాయిదా వేస్తున్నట్లు చెప్పడంతో అలా ఎలా చేస్తారంటూ ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం ఎన్నిక చేయాలని పట్టుబట్టారు. ఇరు పార్టీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.రాయచోటి గ్రామీణ సిఐ వరప్రసాద్, తాటిగుండ్ల శ్రీధర్‌రెడ్డి ఘర్షణ వాతావరణం సర్దుబాటు చేశారు. అక్కడ నెలకొన్న ఘర్షణ వాతావంణంతో ఎంపిడిఒ నూర్జహాన్ వచ్చిన 12 దరఖాస్తులకు నో డ్యూ సర్టిఫికెట్, పన్నుల సర్టిఫికెట్లు లేవని వీటిని రిజెక్ట్ చేస్తున్నట్లు చెప్పారు. వైసిపి వర్గాలు తమకు అదే విధంగా రాసి ఇవ్వాలని పట్టుబట్టడంతో రాత పూర్వకంగా వారికి అందించారు. ఎన్నిక వాయిదా పడడంతో తదుపరి తేదీ ఉన్నతాధికారుల ప్రకటిస్తారని ఎంపిడిఒ వారికి తెలియజేశారు.గంగనేరు సాగనీటి సంఘ చైర్మన్‌గా సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎన్నికల్లో గంగనేరు, సాగునీ టి సంఘ చైర్మన్గా తిరుపతి ఆదిలక్షుమ్మ, వైస్ చైర్మన్‌గా అనగాని నాగభూషణం, దేవదాసి చెరువు కొండూరు మహేశ్వర్ రాజు, వైస్ చైర్మన్‌గా ముద్దులూరి వాసు దేవరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి ఆర్ఒలు అందించారు. ఎన్నికల అధికారులుగా తహసిల్దార్ శ్రావణి, ఎంపిడిఒ నూర్జహాన్, నీటిపారుదల శాఖ ఎఇ గోవర్ధన్, హౌసింగ్ ఎఇ వెంకటేష్, వ్యవహరించారు. **చిట్వేలి:** మండలంలోఉన్న ఆయుకట్టుసంఘాలు ఏకగ్రీవంగా ఎన్నిక య్యాయి. జరిగిన ఎన్నికలలో యల్లమరాజు చెరువుకు నాశంసెట్టిఈశ్వరయ్య, రాజుకుంట చెరువుకు మాధినేని శంకరయ్య, నాగవరం చెరువుకు, సూర్యాలధ ర్మయ్య, మొక్కలచేరువు,సేతుసురేంద్ర, మైలపల్లి చెరువుకు, ముద్దారమేష్‌రెడ్డి(బాబుల్‌రెడ్డి), దేవమాచూపల్లి ఎర్ర చెరువుకు ఆకేపాటి వెంకటరెడ్డి, గొట్టిమానుకొన చెరువుకు సుబ్రమణ్యం,వీరందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. **చిన్నమండెం :** మండలంలోని కేసాపురం పెద్దచెరువు నీటి సంఘం ఎన్నికలు జరిగాయి. చైర్మన్ గా ఉదయ్ శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా కొల్లి శివయ్య,డైరెక్టర్లు షేక్ షమీం, చింతమని రామకృష్ణ, ముల్లంగి సుబ్బరామి శెట్టి, కుమార్ కాల్వ సుదర్శన్ రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.ఈ సందర్భంగారితమ్మ మాట్లాడుతూ ఎన్నికైన అభ్యర్థులకు అభినందనలు తెలియజేస్తూ, అన్నమయ్య జిల్లాలో జరిగిన నీటి సంఘం ఎన్నికలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరిగిందన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో శనివారం జరిగిన తాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి, తహసిల్దార్ హరికుమార్ తెలిపారు .కన్నేమడుగు ఉన్నత పాఠశాలలో కన్నె మడుగు పెద్ద చెరువు ఎన్నికలు జరిగాయి. చైర్మన్‌గా మదన్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా సుధాకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు మౌలాలి బాలకృష్ణ వీఆర్వో వేణుగోపాల్ రెడ్డిలు తెలిపారు.అదేవిధంగా పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్గా శివకుమార్, వైస్ చైర్మన్‌గా శివయ్య, బయమ్మచెరువు చైర్మన్ గాదిరెడ్డి, చైర్మన్‌గా సురేందర్ రెడ్డి. గుండ్లపల్లి చంద్రాయన్ చెరువు చైర్మన్గా వెంకటంమణారెడ్డి , వైస్ చైర్మన్‌గా పెద్దపల్ల. కోటకొండ పెద్ద చెరువు చిన్న రెడ్డప్ప, వైస్ చైర్మన్ గా కృష్ణారెడ్డి.గోపి దిన్నే పెద్ద చెరువు చైర్మన్గా నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ గా సుధాకర్ రెడ్డి.బాలిరెడ్డి చెరువు చైర్మన్గా జోగేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా రఘునాథరెడ్డి. అక్కమ్మ చెరువు చైర్మన్గా శివకుమార్, వైస్ చైర్మన్ గా సుధాకర్ రెడ్డి.రాతి చెరువు చైర్మన్గా రామలింగారెడ్డి, వైస్‌చైర్మన్‌గా నరేంద్ర కుమార్, పంచాల మర్రి చెరువు చైర్మన్గా రామ సుబ్బమ్మ, వైస్ చైర్మన్ గా శివప్ర సాద్. అన్నగారి పని ఆనికట్ట చైర్మన్గా సోమశేఖర్ నాయుడు, వైస్ చైర్మన్గా జయరాజు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు తెలిపారు. ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. **వాల్మీకిపురం:** పీలేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 18 సాగునీటి సంఘాలకు శనివారం ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. కెవిపల్లి మండలం మినహా మిగిలిన ఐదు మండలాల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలేరు మండలంలో 3, కలికిరి మండలంలో 2, కలకడ మండలంలో 2, గుర్రంకొండ మండలంలో 5, వాల్మీకిపురం మండలంలో 6 సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ 18 సాగునీటి సంఘాలకు అధికార పార్టీ మద్దతుదారులు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికకావడం పట్ల ప్రజల్లో పలు విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. అధికారపార్టీ నాయకులు చెప్పిన వారికి, అధికారపార్టీ మద్దతు దారులకు పదవులు కట్టబెడుతుండడం గమనార్హం. **నందలూరు :** మండలంలో శనిర్వహించిన నీటి సంఘాల ఎన్నికలు ప్రశాం తంగా జరిగాయి. మొత్తం 13 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిం చగా 12 చోట్ల ఏకగ్రీవంగా, ఒకచోట ఎన్నికలు జరిగాయి. నందలూరు కన్యక చెరువు నీటి సంఘం అధ్యక్షులు గా బుశెట్టి వెంకటసుబ్బయ్య ఉపాధ్యక్షులుగా షేక్ మస్తాన్ వల్లి, నల్ల తిమ్మయ్య గారి పల్లె స్ప్రింగ్ ఛానల్ కు అధ్యక్షులుగా దండు మల్లి కార్జునరెడ్డి, ఉపాధ్యక్షులుగా గడికోట శ్రీనివాసులు రెడ్డి, చింతల కుంట మర్రి వాను వంక కాలువ అధ్యక్షులుగా చింతం రెడ్డి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా పప్పు రామచంద్రారెడ్డి, ఆడపూరు స్ప్రింగ్ ఛానల్ కు అధ్యక్షులుగా కొండూ రు జయరామరాజు ,ఉపాధ్యక్షులుగా నాగిరెడ్డి సరస్వతమ్మ, పాటూరు ఎగువ కాలువ అధ్యక్ష లుగా లగిడి శివశంకర్‌రాజు, ఉపాధ్యక్షులుగా ఏలుగు జయమ్మ, దిగువ కాలవకు అధ్యక్షులుగా సమ్మెట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా నారాయణ, లేపాక చెరువు అధ్యక్షులుగా కడవకూటి తిరుపతయ్య ఉపాధ్యక్షులుగా పుల్లంపేట చంద్రయ్య, టంగుటూరు కొత్త కాలువ అధ్యక్ష లుగా ముమ్మడి నరసింహారెడ్డి ఉపాధ్యక్షులుగా మామిళ్ళ చిన్నయ్య, సొంత కాలువ అధ్యక్షులుగా గాజుల వెంకట సుబ్బమ్మ ఉపాధ్యక్షులుగా మంచా లోకేశ్వరయ్య, కుందా నెల్లూరు స్ప్రింగ్ ఛానల్ అధ్యక్షులుగా ఆవుల పుల్లయ్య ఉపాధ్యక్షులుగా కడప పెంచలయ్య, వైసిపల్లె నామాల వంక అధ్యక్షులుగా మేడ నాగరాజమ్మ ఉపాధ్యక్షులుగా సాతుపల్లి పిచ్చిరెడ్డి, పొత్తపి స్ప్రింగ్ ఛానల్ కు అధ్యక్షులుగా మిరియాల విజయభాస్కర్ ,ఉపాధ్యక్షులుగా పోలారపు లక్ష్మయ్య నాయుడు ఏకగ్రీవం గా ఎంపికయ్యారు. నూకినేని పల్లె స్ప్రింగ్ ఛానల్‌కు ఎన్నికలు జరుగగా అధ్యక్షులుగా గణపతి నరసింహులు ఉపాధ్యక్షులుగా చింతకాయల నరసింహులు ఎంపికయ్యారు


నందలూరు: కన్యక చెరువు నీటి సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్య

చిన్నమండెం : నియామక పత్రాలు అందుకుంటున్న చైర్మన్‌లు

పుల్లంపేట : నియామక పత్రాలతో చైర్మన్లు, వైస్ చైర్మన్లు

పీలేరు: చింతలచెరువు సంఘం అధ్యక్షుడికి డిక్లరేషన్ అందిస్తున్న తహశీల్దార్

సక్రమంగా పనిచేయని ఆధార్ సేవా కేంద్రాలు

- తీవ్రఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గట్టులో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ సకాలంలో పనులు చేయలేదు. పట్టణంలోని నాలుగో సచివాలయంలోని సెంటర్‌లో ఆరోగ్య సమస్యలతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీలత ఆధార్ సెంటర్ నుంచి తప్పుకోవడంతో ప్రజలకు ఇబ్బందులు మళ్లీ మొదలయ్యాయి. ఉన్న మూడు ఆధార్ కేంద్రాల్లో శంకరాపురంలో మాత్రం అందుబాటులో ఉన్నా అక్కడ నిర్వాహకుల పనితీరు సరిలేకపోవడంతో ప్రజలంతా నాలుగో సచివాలయానికి వచ్చేవారు. ఇక్కడ ఆధార్ సెంటర్ మూసివేయడం, పాఠశాలలో చదువుతున్న పిల్లలు ఆధార్ అప్‌డేట్ కోసం మార్చి 31 వరకు వ్యవధి ఉన్న ఉపాధ్యాయులు, యాజమాన్యం, ఆధార్ అప్‌డేట్ తెస్తేనే అంటూ షరతులు పెడుతున్నారు. ఈ విషయంపై ఎంఇఒ భీమేశ్వరాచారి వివరణ కోరగా మార్చి 31 వరకు వ్యవధి ఉందని చెప్పారు. అయినా విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం విడ్డూరంగా ఉంది. పిల్లలు స్కూల్లో మానేసి ఆధార్ తీయించమని తల్లితండ్రులతో ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ సెంటర్లను పెంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామ సచివాలయంలో మూసివున్న ఆధార్ కేంద్రం

మీ విధానాన్నే మేమూ పాటిస్తున్నాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గత అయిదేళ్లల్లో మీరు పాటించిన విధానాలనే తామూ పాటిస్తున్నామని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి వైసిపి నాయకులనుద్దేశించి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 30ఏళ్లుగా, గత ఐదేళ్ల వైసిపి పాలనలో పులివెందుల నియోజకవర్గంలో ఎలాంటి రాజకీయాలు చేశారో అందరికీ తెలుసని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిడిఒ కార్యాలయాల వద్ద జీపులు అడ్డుపెట్టి, కుర్చీలు వేసుకుని కూర్చుని నామినేషన్ వేయడానికి వచ్చిన టిడిపి నాయకుల పత్రాలను గుంజుకొని దౌర్జన్యాలకు పాల్పడింది మీరు కాదని ఆయన ప్రశ్నించారు. మీరు నేర్పిన పాఠం ప్రకారమే మేమూ చేస్తే ఓర్చుకోలేని మాటలు అనడం ఏంటని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో మీరు ఏ విధంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించారో.. మేమూ కూడా రెట్టింపులో ఈ అయిదేళ్ల అలాగే పరిరక్షిస్తామన్నారు. దమ్ముంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని, ఎలాంటి పరిస్థితుల్లో పోటీ చేయనీయమన్నారు. ఆ ఎన్నికల్లో కూడా ఇలానే చేస్తామని మీరు నేర్పిన ప్రజాస్వామ్య పద్ధతినే మేము అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, అక్కులుగారి విజయ్ కుమార్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలూ ఎంతో అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

విద్యతోపాటు క్రీడలు కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. పట్టణంలో మొదటిసారిగా వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగి వేమన యూనివర్సిటీ ఆధ్వర్యంలో శని వారం ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2004లో వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేయుటకు ఎంతో కృషి చేశామని తెలిపారు. ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎంతో ఉన్నత స్థానాలకు ఎదిగారని ఎమ్మెల్యే తెలిపారు. క్రీడలలో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యా ర్థులు, అధ్యా పకులతో కలిసి ఉత్సాహంగా క్రీడా పోటీలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.జయరామిరెడ్డి, యోగి వేమన యూని వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల డీన్ రమణయ్య, నాగరాజు, వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రఘు నాథరెడ్డి, రసూల్ గౌస్ పాల్గొన్నారు.

18న ఢిల్లీ ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి -ముద్దనూరు :ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 18న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు మాదిగలు తరలిరావాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లయ్య మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక పాత బస్టాండ్ బస్‌షెల్టర్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎల్లయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల రిజర్వేషన్ 50 శాతం నుండి 80 శాతం పెంచాలన్నారు. కుల గణాంకాల సేకరణ దేశ వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. దళితులలో పేదరికం, అంటరానితనం నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తితో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. దళిత గిరిజనుల అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలను జనాభా ప్రాతిపదికన పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుల్లయ్య, మండల ఓబులేసు, కృష్ణయ్య, నాగరాజు, ఓబులేసు, మునెయ్య, బాలాంజనేయులు పాల్గొన్నారు.